క్లుప్తంగా

నేడు వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని కేతవరం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డా.రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలోని విలేజ్ క్లీనిక్ వద్ద ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ గ్రామ పరిధిలోని ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

నేడు మండల సమావేశం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10-30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ వరప్రసాదరావు తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్ష, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు.

పౌష్టికాహారంతో టీబీ నిర్మూలన

ప్రొద్దుటూరు క్రైం : టీబీ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి తగ్గుముఖం పడుతుందని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తెలిపారు. టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆస్పత్రిలోని టీబీ యూనిట్‌లో పవర్‌గ్రిడ్ సహకారంతో గురువారం టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్‌లను పంపిణీ చేశారు. డాక్టర్ హిమబిందు, డాక్టర్ నజీర్, టీబీ సూపర్‌వైజర్ రాజారత్నం, ఎస్టీఎస్ షేక్ హుస్సేన్‌బాషా, టీబీహెచ్‌వీ గురుప్రసాద్, సిద్ధారెడ్డి, ఐటీ విజయ్, ఎఫ్‌సీ చంద్ర, ఫౌజియా, సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ముస్లిం కమ్యూనిటీ హాల్‌లో గురువారం అల్ మున్వర్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రాకు వెళ్లే యాత్రికులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది జిలానిబాషా, మహమ్మద్ అస్లాం మాట్లాడుతూ ఉమ్రా యాత్ర 15 రోజులు కొనసాగుతుందని చెప్పారు. 9 రోజులు మక్కాలో, 5 రోజులు మదీనాలో యాత్రికులు గడపాల్సి వస్తుందన్నారు. గైడ్ ద్వారా అక్కడి పవిత్ర స్థలాలను సందర్శన చేయిస్తారని తెలిపారు. ప్రొద్దుటూరు నుంచి ఈ నెల 26న 80 మంది యాత్రికులు ఉమ్రాకు వెళ్లనున్నట్లు చెప్పారు. మౌలానా అబ్దుల్ రహీం సాల్ఫీ ఉమ్రాలో ఆచరించాల్సిన నియమాల గురించి వివరించారు. అనంతరం యాత్రికులకు బ్యాగులను పంపిణీ చేశారు.

నాణ్యమైన విత్తనాలు అమ్మాలి

గోపవరం : రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని మండల వ్యవసాయాధికారి అరవిందనాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని శ్రీలక్ష్మీనరసింహ విత్తనాలు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణంలో ఉన్న స్టాకుకు సంబంధించి రిజిస్టర్‌లో సరిగా నమోదు చేసుకోకపోవడంతో అనుమతి లేని రూ.61,140లు విలువ చేసే పురుగు మందులు, విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

శంకుస్థాపన



అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న భక్తులు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరురోడ్డులో రూ.5 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అయ్యప్పస్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేదపండితులు భాకరాపేట సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం భూమిపూజ నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, ఆలయ కమిటీ కార్యదర్శి కొండపల్లి సుభాష్‌కుమార్, ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, సభ్యులు ప్రభాకర్, నాగరాజు, వెంకటసుబ్బయ్య, గురుస్వాములు వేణు, ఆదినారాయణ, మునెయ్య, పెద్ద సంఖ్యలో అయ్యప్పస్వామి మాలధారులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండుగ చేసింది జగనన్నే

రాజుపాళెం: రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించింది సీఎం జగనన్నే అని మండల వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని గాదెగూడూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి కలెక్టర్ వద్దకు వెళ్లి కేసీ చాపాడు, మైలవరం కాలువలకు నీళ్లు వచ్చేలా చేశారన్నారు. ఎమ్మెల్యే చొరవతోనే పంటలకు నీటితడులు అందించుకుంటున్నారన్నారు. పార్టీ మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి మాట్లాడుతూ ఉప కాలువల్లో పూడిక తీయలేదని పర్లపాడు మహేశ్వర రెడ్డి అంటున్నారని, ఆ కాలువల్లో ప్రతి ఏడాది ఉపాధిలో కూలీలు పూడిక తీస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలి



వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మైదుకూరు : జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



బద్వేలు అర్బన్ : బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

ప్రొద్దుటూరు : టీడీపీ పాలనలో పింఛన్ కోసం వృద్ధులు ఇబ్బందులు పడ్డ రోజులను మరిచిపోవద్దని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో పార్కు వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇస్తున్నారని, నాటికీ- నేటికీ వ్యత్యాసాన్ని పోల్చుకోవాలన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. వైఎంఆర్ కాలనీలోని పెద్దమ్మ గుడి వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, రాష్ట్రఅదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

జెండా విష్కరణ

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ సచివాలయం-2 వద్ద గురువారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ఓబయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాజుపాళెం : పార్టీల కతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎంపీపీ సలోమి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, వైస్ ఎంపీపీ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గాదెగూడూరు గ్రామ సచివాలయంలో గురువారం సాయంత్రం ఏపీకి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పోలా వరలక్ష్మి వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మా నమ్మకం నువ్వే జగన్ జెండాను వారు ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెండవ వైస్ ఎంపీపీ సుబ్బలక్షుమ్మ, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, ఎంపీడీఓ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్‌ను ఆదరించండి

మైదుకూరు : రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించాలని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని కృష్ణాపురంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలోఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. కృష్ణాపురం సచివాలయం పరిధిలో పథకాల లబ్ధిని తెలిపే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ పరమేశ్వర్‌రెడ్డి, అధికారి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహబూబ్ షరీఫ్, వార్డు ఇన్‌చార్జి బీఎల్ రఘురామయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు లింగన్న, రాయుడు, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న పాల్గొన్నారు.

విశ్వనాథపురంలో..

మండలంలోని విశ్వనాథపురంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తనయుడు, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సచివాలయ పరిధిలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ థామస్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలే సుధాకర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ బండి నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వలన కలిగిన లబ్ధిని వివరించాలి

చాపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని ప్రతి కుటుంబానికి వివరించాలని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య పేర్కొన్నారు. మండలంలోని పెద్దగురువళూరు గ్రామంలో గురువారం సాయంత్రం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. పెద్దగురువళూరు పంచాయతీలో ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం రూ.18 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమం, అభివృద్ధి వివరాలను వివరిస్తూ డిస్ ప్లే బోర్డును ప్రదర్శించారు. ఇదే క్రమంలో గ్రామంలోని కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ రాజేష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జగన్‌తో సాధ్యం

దువ్వూరు : సంక్షేమం, అభివృద్ధి జగన్‌తో సాధ్యమని ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కానగూడూరు గ్రామ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఒక్క కానగూడూరు సచివాలయంలో నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రూ.19.93 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ నేతలతో కలసి ఎంపీపీ ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, ఎంపీటీసీ కామనూరు సుబ్బమ్మ, సర్పంచ్ కోటలో బీబీ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చారు.. అండగా నిలుద్దాం

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారని ... అటువంటి సంక్షేమ సారథికి అండగా నిలిచి మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని భావనారాయణనగర్ సచివాలయం పరిధిలో గురువారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సచివాలయం పరిధిలోని ఆయా కుటుంబాలకు గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రత్యక్ష నగదు బదిలీ, పరోక్ష ప్రయోజనాలు కింద చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. అనంతరం సచివాలయం ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పెద్ద ఎత్తున సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాబోవు ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవి శ్రీరాములు, వైవీయూ పాలక మండలి సభ్యులు చిన్న సుబ్బారావు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్ రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, కౌన్సిలర్లు మహేష్, వెంకటేశ్వర్లు, కరీముల్లా, సత్యం, ఓబుల్ రెడ్డి, రమేష్ బాబు, కేశవ రెడ్డి, మౌలాలి, చెన్నకృష్ణా రెడ్డి, నారాయణ రెడ్డి, నాగేశ్వర్‌రావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

విప్లవాత్మక పాలన అందిస్తున్న జగనన్న

చరిత్రలో ఎన్నడూ ఎరుగని విప్లవాత్మక పాలన అందిస్తున్న జగనన్నకు ప్రతిఒక్కరు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు మల్లేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో భాగంగా గురువారం తిప్పనపల్లె పంచాయతీ సచివాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని తెలిపే బోర్డును ఆవిష్కరించి అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, చిన్నసుబ్బారెడ్డి, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సీఎం జగన్ చేసిన మంచిని వివరించండి

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మంచిని వివరించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని నరసాపురం గ్రామ సచివాలయ ఆవరణలో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ సచివాలయంలో సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు వివరాల డిస్‌ప్లే బోర్డును ప్రదర్శించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జీ.హనుమంతరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ రమణారెడ్డి, మిద్దెల సర్పంచ్ వెంకటరామిరెడ్డి, బద్వేలు మార్కెట్ యార్డు డైరెక్టర్ కె.ఎల్.వెంకట రెడ్డి, రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ ముఖ్యమంత్రి జగన్

అట్లూరు : పేదలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందివ్వడంలో మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నారని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, మండల కన్వీనరు ముదమాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక అట్లూరు సచివాలయ ఆవరణంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ జెండా ఆవిష్కరణతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మణ్యం వెంకటరెడ్డి, సచివాలయాల మండల కన్వీనరు మణ్యం మల్లికార్జునరెడ్డి, సర్పంచు యల్లమ్మ, నాయకులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే రావాలి

పోరుమామిళ్ల : కొత్రపాటిపల్లె సచివాలయంలో గురువారం జరిగిన జగనన్న మళ్లీ ఎందుకు కావాలి కార్యక్రమంలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సియం బాషా పాల్గొని మాట్లాడారు. ఇప్పుడు ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనన్నే కావాలని వారు పేర్కొన్నారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేశారు. పంచాయతీలో అమలు చేసిన వివిధ పథకాలకు సంబంధించిన వివరాలతో కూడిన బోర్డు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, సచివాలయాల కన్వీనర్ కల్లూరి రమణారెడ్డి, సర్పంచ్ కాశీలక్ష్మి, మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ పథకాలు

కలసపాడు : మండలంలోని ఇ.తంబళ్ళపల్లె సచివాలయ పరిధిలో గురువారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సగిలి సుదర్శన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం ఆవరణలో లబ్ధిపొందిన వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, నారాయణ యాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, సింగరయ్య, అంకిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు సంక్షేమ పథకాలు

బ్రహ్మంగారిమఠం : ప్రతి నిరుపేదకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు కావాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ ఉంటేనే ఆ పథకాల పంపిణీ సాధ్యమౌతుందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని డి.నేలటూరు సచివాలయంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం చేపట్టారు. అనంతరం జెడ్పీటీసీ ఎం.రామగోవింద రెడ్డి పార్టీ కన్వీనర్ మేకల రత్నకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సచివాలయం సమీపంలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు మణ్యం శంకర్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, శేషారెడ్డి, జోగయ్య, పాలరామిరెడ్డి, సిద్దారెడ్డి, దుగ్గిరెడ్డి, సర్పంచ్‌లు అమీర్‌బాషా, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బి.కోడూరు : సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని జెడ్పీటీసీ దావీదు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డిలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని మున్నెల్లి సచివాలయం పరిధిలో ఉప సర్పంచ్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమం నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, నారాయణరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

పల్లెలకు కూడా త్రీఫేస్ విద్యుత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ


పోరుమామిళ్ల: ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు, పల్లెలకు కూడా త్రీఫేస్ విద్యుత్ 24 గంటలు సరఫరా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రమణ తెలిపారు. గురువారం పోరుమామిళ్లలో నాలుగు మండలాల విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాలు ఇకపై ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. పట్టణంలో కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించానని, వాటి చుట్టూ ముళ్లకంప, గడ్డి పెరిగి ఉందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సిబ్బందితో జరిగిన సమావేశంలో చాలా అంశాలపై హెచ్చరించానని, మార్పు రాకపోతే నాకు ఫోన్ చేస్తే చర్య తీసుకుంటానన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు.

సిబ్బందిపై ఆగ్రహం..

అంతకు ముందు నాలుగు మండలాల సిబ్బందితో జరిగిన సమావేశంలో ఎస్ఈ రమణ మాట్లాడుతూ కేటాయించిన ప్రదేశాల్లో నివాసం ఉండని ఉద్యోగులకు సంస్థ చెల్లిస్తున్న ఇంటి అద్దె ఆపివేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు కింది నుండి పై స్థాయి వరకు ప్రతి ఉద్యోగి పని చేయాలన్నారు.

విద్యుత్ పనులు చేసేటపుడు భద్రత నియమాలు పాటించాలన్నారు. నెలలోగా విద్యుత్ అంతరాలు తగ్గించకపోతే చర్య తప్పదని హెచ్చరించారు. 4 మండలాల్లో విద్యుత్ బకాయిలు వసూలు చేయాలన్నారు. 2 కోట్ల 10 లక్షల రూపాయల బకాయి ఉందని, వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో లైన్‌మెన్, జేఎల్ఎంలకు లైన్ ఇండెక్షన్ టెస్టర్లు పంపిణీ చేశారు. సమావేశంలో డీఈఈలు వెంకటరామిరెడ్డి, నాయక్, నాలుగు మండలాల ఏఈఈలు, అకౌంట్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు అయ్యవారిపల్లె విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హామర్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప తెలిపారు. ఈ నెల 16న కడపలోని స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ హామర్ త్రో అండర్-17 పోటీలలో బాలుర విభాగంలో ఆసీఫ్, బాలికల విభాగంలో శ్రీదీప, లక్ష్మీ ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో నరసరావుపేటలో జరిగే 67వ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొననున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటి డీఎంహెచ్ఓ భారతి

అట్లూరు: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎం.భారతి పేర్కొన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బందికి, ఏఎన్ఎంలకు, ఆశావర్కర్‌లకు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారులు కె.హమీదాబేగం, ఎస్. మాధురి, సిహెచ్ఓ మురళి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

బద్వేలు అర్బన్ : బాలికల నిష్పత్తిని పెంచేందుకు ప్రతిఒక్కరం కృషి చేద్దామని జిల్లా మాస్‌మీడియా అధికారి డి.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో లింగవివక్షపై బద్వేలు మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని ఏఎన్ఎంలు, సీహెచ్‌ఓలు, ఆశాలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికల సంఖ్య పెంచాలంటే తొలుత లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, మరియకుమారి, మౌనిక, సీహెచ్ఓ చంద్రావతి, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేతలు.. కళ్లుండీ చూడలేని దృతరాష్ట్రులు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : టీడీపీ నేతలు కళ్లుండి చూడలేని దృతరాష్ట్రులని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి జగన్ సహకారంతో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి మహర్దశ పట్టిందన్నారు. గత 40 ఏళ్లుగా జరగని అభివృద్ధిని జగన్ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేయడం సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తాగడానికి నీళ్లు అందుతాయో లేదాననే గ్యారెంటీ ప్రజలకు లేదన్నారు. రూ.150 కోట్లతో అమృత్ నీటి పథకాన్ని పూర్తి చేసి పట్టణ ప్రజలకు శుద్ధి జలాలు అందిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా నిర్మిస్తున్న రోడ్డు పనులు మరో 20 రోజుల్లో పూర్తవుతాయన్నారు. ఏదో కారణంతో విమర్శించడమే టీడీపీ నేతలు పనిగా పెట్టుకున్నారన్నారు. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజులరెడ్డి కానీ, 14 ఏళ్ల టీడీపీ ప్రభుత్వంలో కానీ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. సోమాపురం, అర్కటవేముల వద్ద వంకపై రెండు కాజ్‌వేలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇన్నేళ్లుగా సోమాపురం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య గతంలో పాలకుల దృష్టికి ఎందుకు రాలేదని విమర్శించారు. నరసింహాపురం గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో గ్రామస్తులు టీడీపీకి మెజారిటీ ఇచ్చారని, అయినా ఆ నేతలు ఈ సమస్యను గాలికొదిలేశారన్నారు. కల్లూరు, చెన్నమరాజుపల్లెల రోడ్లు చాలా అధ్వానంగా ఉండేవని, వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఉండేదని, దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్లి పరిశీలించి రూ.9.10 కోట్లు మంజూరు చేయించానన్నారు. రాజుపాళెం మండలంలో రూ.51లక్షలతో కూలూరు-పగిడాల, నక్కలదిన్నె - కొత్రపాడు రోడ్డు రూ.73 లక్షలతో, రూ.1.09 కోట్లతో పగిడేల-అర్కటవేముల, రూ.43 లక్షలతో అయ్యవారిపల్లె - గాదెగూడూరు, రూ.54 లక్షలతో ఉప్పరపల్లె, రూ.36 లక్షలతో నంగనూరుపల్లె-రేగుళ్లపల్లె, రూ.54 లక్షలతో వాసుదేవపురం రోడ్లు నిర్మించామన్నారు. తాళ్లమాపురం గ్రామ సమీపంలో కేసీ కెనాల్ వెంబడి రూ.90 లక్షలతో, కల్లూరు-రేగుళ్లపల్లె మధ్య రూ.1.50 కోట్లతో, శంకరాపురం-చిన్నశెట్టిపల్లె గ్రామాల మధ్య రూ.4.90 కోట్లతో, పెద్దశెట్టిపల్లె-కాకిరేనిపల్లె గ్రామానికి రూ.3.60 కోట్లతో రోడ్లు మంజూరు చేయించామని తెలిపారు. ఆర్అండ్‌బీ పరిధిలో మొత్తం 42.95 కిలోమీటర్ల పరిధిలో రోడ్లను నిర్మించామని చెప్పారు. అలాగే పట్టణాలు, గ్రామాల్లో 95 కిలోమీటర్ల పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించామన్నారు. ఏపీ ట్రాన్స్‌కో ద్వారా నిధులు మంజూరు చేయించి రూ.1.31 కోట్లో కూలూరులో రోడ్లు నిర్మించామన్నారు. సోములవారిపల్లె జగనన్న కాలనీకి వెళ్లే తారు రోడ్డును రూ.83 లక్షలతో నిర్మించినట్లు చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.94 కోట్లతో రోడ్లు, కాలువలు నిర్మించామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు పాల్గొన్నారు.


సబ్‌స్టేషన్ పరిశీలన

కలసపాడు : మండలంలో రైతులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ ఎస్.రమణ అన్నారు. గురువారం స్థానిక సబ్‌స్టేషన్‌ను పరిశీలించి విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించారు. మండలంలో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, అలా లేకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పురోగతి లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిరసన

పోరుమామిళ్ల: ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన (జేవీడీ), వసతి దీవెన నిధులు ఇంతవరకు తల్లి అకౌంటులో జమ చేయడం జరిగిందని, ఇపుడు విద్యార్థితో కలసి జాయింట్ అకౌంట్ ప్రారంభించాలనడం ఇబ్బందికరంగా ఉందని ఏబీవీపీ కడప విభాగ్ కన్వీనర్ మల్లికార్జున, జిల్లా కన్వీనర్ అభిలాష్ పేర్కొన్నారు. గురువారం వారు ఏబీవీపీ మండల నాయకులతో కలసి పోరుమామిళ్లలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే తల్లి అకౌంటులోనే నిధులు జమ చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వినయ్, కార్తీక్, నందు పాల్గొన్నారు.

ఎన్ఎహెచ్ 40 రోడ్డు పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రాజుపాళెం : వేంపల్లె, చాగలమర్రి నాలుగు వరుసల రహదారిలో భాగంగా రాజుపాళెం మండలంలోని కొత్రపాడు నుంచి వెల్లాల గ్రామం వరకు గురువారం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఆ గ్రామాల మీదుగా వెళుతున్న నాలుగు వరుసల రహదారిలో నిమ్మ చెట్లు, ఇళ్లు, బోర్లు తదితర వాటిని ఆర్డీఓ చూశారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఆర్డీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటసాయినాథరెడ్డి, సర్వేయర్ గురుశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి ఆర్ఐ అశోక్, ఆయా గ్రామాల వీఆర్ఓలు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బస్టాండ్ ఇన్, అవుట్ గేట్లను మార్చాలని వినతి

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి బస్సులు లోపలికి, బయటకు వెళ్లే మార్గాలను మార్చాలని గురువారం సీపీఐ నాయకులు డిపో మేనేజర్ శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు. చాలా ఏళ్లుగా ఉన్న అవుట్, ఇన్ గేట్లను ఇటీవల అధికారులు మార్చడంతో బస్టాండ్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని వారు డీఎంకు వివరించారు. ప్రస్తుతం అవుట్ గేటుగా వినియోగిస్తున్న రహదారి ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. గతంలో ఉన్నట్లుగానే ఇన్, అవుట్ గేట్లను నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు వినతి పత్రాన్ని డీఎంకు అందించారు. దానిపై డీఎం శ్రీనివాసరావు స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి శనివారం లోపల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఐ నాయకులు శ్రీరాములు, శివరాం, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పీటీడీ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: రాష్ట్ర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌కు గుర్తింపు హోదాను ఇవ్వడం అభినందనీయమని వైఎస్ఆర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. బాబా ఫకృద్దీన్ తెలిపారు. గురువారం ఆయన సాక్షితో మాట్లాడుతూ తమ యూనియన్‌కు గుర్తింపు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావుకు, వైఎస్ఆర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ మల్లి ఖార్జున రెడ్డికి, కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డికి, రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ బాషకు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లి చంద్రయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.